# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 116 | పేజీలు: 4 | వెల: 4/- | బుధవారం 20, నవంబర్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## అక్రమాలు కూల్చడమే కాదు...

### చెరువుల రక్షణకూ కఠిన చర్యలు

### హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడి



సంగారెడ్డి,నవంబర్19(నమస్తే ఉదయం): అక్రమ కట్టడాలు కూల్చివేతలే కాదు..కబ్జా చేసిన చెరువులను పునరుద్ధరిస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటించారు. వెంకరమణ కాలనీ, శంభునికుంట, అమీన్‌పూర్ పెద్ద చెరువు, హెచ్ఎంటీ స్వర్ణపురి కాలనీ, పద్మరావు నగర్ సరిహద్దు ప్రాంతాల్లో పర్యటించిన రంగనాథ్.. స్థానికులతో మాట్లాడారు. అక్కడ భూములు ఆక్రమించి వేసిన లేఅవుట్లు, ఇతర సమస్యలపై పలువురు స్థానికుల రంగనాథ్ దృష్టికి తీసుకొచ్చారు.ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ.. అమీన్‌పూర్ పెద్ద చెరువుకు సంబంధించి అనేక ఫిర్యాదులు అందాయి. పెద్ద చెరువు అలుగులు, తూములు మూసేయడంతో ఎఫ్‌డీఎల్ పెరిగిందని బాధితులు ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రత్యేకమైన టెక్నికల్ బృందంతో సర్వే చేయిస్తాం. సర్వే నివేదిక ఆధారంగా ప్రభుత్వంతో చర్చించి మూడు నెలల్లో ఫలితాలతో మళ్లీ వస్తాం.



## కాగ్ అధిపతిగా తెలుగు వ్యక్తి సంజయ్‌మూర్తి

న్యూఢిల్లీ,నవంబర్19(నమస్తే ఉదయం): కేంద్రంలోని కీలక పదవిలో ఓ తెలుగు వ్యక్తికి అదృష్టం వరించింది. కాగ్ అధిపతిగా ఏపీకి చెందిన సంజయ్‌మూర్తి నియమితులయ్యారు. రాష్ట్రపతి ముర్ము కాగ్ చీఫ్‌గా ఆయనను నియమించినట్టు కేంద్ర ఆర్థికశాఖ వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం ఖర్చు పెట్టే ప్రతీ రూపాయి సరిగా ఖర్చు చేసిందా పక్కదారి పట్టిందా చూసే బాధ్యత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్. ప్రభుత్వం ఖర్చుల గురించి ఏడాదికి ఒకసారి నివేదిక ఇస్తుంది. దాన్ని పార్లమెంటులో ప్రభుత్వాలు ప్రవేశపెడతాయి. దాని ఆధారంగా అధికార-విపక్షాల మాటల

మిగతా.. 2లో




## కాలుష్యంతో ఇబ్బందులు

- అలాంటి పరిస్థితి రావద్దని ఈవీ పాలసీ తెచ్చాం
- కాలుష్యంతో పాఠశాలలు బంద్ చేసే పరిస్థితి
- ఎలక్ట్రిక్ వాహనాలను విస్తృతంగా వాడేలా ఈ పాలసీ
- రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్,నవంబర్ 19 (నమస్తే ఉదయం): తెలంగాణలో అలాంటి పరిస్థితి రావద్దని ఈవీ పాలసీ తెచ్చామని రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ ప్రజలకు విజ్ఞప్తి మేరకు ఢిల్లీలో తీవ్ర కాలుష్యంతో పాఠశాలలు బంద్ చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. హైదరాబాద్ & తెలంగాణలో అలాంటి పరిస్థితి రావద్దని ఈవీ పాలసీ తెచ్చామన్నారు. తెలంగాణ ఎలక్ట్రిక్ వాహనాలను విస్తృతంగా ప్రజలు వాడేలా ఈ పాలసీ ఉందన్నారు. ఈవీ వాహనాలపై రోడ్డు టాక్స్ రిజిస్ట్రేషన్ ఫీజు 100 శాతం మినహాయింపు ఇస్తున్నామన్నారు. ఇప్పటికే స్క్రాప్ పాలసీ

మిగతా.. 2లో

- అభివృద్ధిని అడ్డుకునే కుట్రలను సహించం
- కిరాయ మూకలతో చెరేగితే చండాడుతాం
- దుర్బుద్ధి పనులను మారుకోకుంటే జైలుకు తరలిస్తాం
- కెసిఆర్ ఫామ్‌హౌజ్ వీడి ప్రజల్లోకి రావాలి
- తెలంగాణను అప్పలతో ముంచారు
- తాగుబోతుల రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనుడు
- మహిళల అండతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు
- వారి అభ్యున్నతికి కట్టుబడి ఉన్నాం
- వరంగల్‌ను ప్రముఖ నగరంగా తీర్చిదిద్దుతాం
- ఇక్కడ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కట్టుబడి ఉన్నాం
- వరంగల్ వేదికగా విజయోత్సవ సభలో సిఎం రేవంత్



## బీఆర్ఎస్ నేతలు

# కుట్రలు చేస్తే... జైలుకే

వరంగల్,నవంబర్19(నమస్తే ఉదయం): తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునేలా బీఆర్ఎస్ నేతలు కుట్రలు చేస్తే జైల్లో పెడతాం అని సిఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. కుట్రలు కుతంత్రాలతో అభివృద్ధిని అడ్డుకోలేరని అన్నారు. పదేళ్లపాటు తెలంగాణను దోచుకున్న సొమ్ముతో కిరాయిమనుషులతో అడ్డుకుంటే ఊరుకోబోమని హెచ్చరించారు. వరంగల్ వేదికగా బీఆర్ఎస్ పార్టీపై, ఆ పార్టీ అధినేత కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం చేయలేని పనులు తాము చేస్తుంటే పనులు చేస్తుంటే కుట్రలు, కిరాయి రౌడీలతో అభివృద్ధిని అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. దుర్బుద్ధితో అభివృద్ధి పనులను అడ్డుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కేసీఆర్ అనే మొక్కను తెలంగాణ గడ్డపై మళ్ళీ మొలవ నివ్వనని శపథం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ తెచ్చిన బెల్ట్ షాపులు ఊరురా ఉన్నాయని విమర్శించారు. రాష్ట్రంలో తాగుబోతుల సంఘానికి ఏకైక అధ్యక్షుడు కేసీఆర్ అని.. ఆయన ఫుల్ బాటిల్‌కు బ్రాండ్ అంబాసిడరని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్న పదేళ్ల పాటు కేసీఆర్ జనాన్ని మత్తులో ముంచెత్తాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తోన్న సందర్భంగా ప్రభుత్వం- ప్రజా పాలన-ప్రజా విజయోత్సవ వేడుకలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం వరంగల్ ఆర్ట్స్ కాలేజీలో ప్రజా పాలన విజయోత్సవ తొలిసభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరై సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్ మాట ఇచ్చి.. పదేళ్లలో రుణమాఫీ చేయలేదని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఆరు నెలల్లోనే రుణమాఫీకి రూ.18వేల కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. ఒక్కసారి ఓడిస్తే.. మళ్లీ ప్రజల మొహం చూడరా? అధికారం ఇస్తే దోచుకోవడం.. ఓడిస్తే ఫామ్‌హౌస్‌లో కూర్చోవడమేనా మీ పని అని ప్రశ్నించారు. ప్రజల మీద ప్రేమ ఉంటే ఎందుకు ప్రజల మధ్యకు రావడం లేదని నిలదీశారు. నిజంగా ప్రజలు కష్టాల్లో ఉంటే వాళ్ల మధ్యకు వచ్చి ఎందుకు అడగటం లేదన్నారు. రాహుల్ గాంధీని చూసి కేసీఆర్ బుద్ధి తెచ్చుకోవాలన్నారు. మూడుసార్లు అధికారం దక్కకపోయినా.. రాహుల్ గాంధీ ప్రజల మధ్యే ఉన్నారని గుర్తు చేశారు. ప్రధాన ప్రతిపక్ష నేతగా కేసీఆర్ తన బాధ్యతను

మిగతా.. 2లో

## హామీల చర్చపై రేవంత్


# సవాలును స్వీకరిస్తున్నా

- ఏం చేశారని సంబరాలు చేసుకుంటున్నారు
- అన్నిరంగాల్లో విఫలం అయ్యిందని ప్రజలు అంటున్నారు
- నీతో మోడీ ఎందుకు.. మేము వస్తాం...ఎక్కడో చెప్పండి
- లగచర్ల ఘటనతో రాష్ట్ర రైతుల్లో తీవ్ర ఆందోళన
- ఏ క్షణాన మా భూములు పోతాయో అని భయం
- మీడియా సమావేశంలో బిజెపి ఎంపి ఈటెల రాజేందర్



హైదరాబాద్,నవంబర్19(నమస్తే ఉదయం): కాంగ్రెస్ సంబరాలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని మల్కాజ్‌గిరి భాజపా ఎంపీ ఈటల రాజేందర్ ఎద్దేవా చేశారు. ఏం ఘనత సాధించారని సంబరాలు చేసుకుంటున్నారని సూటిగా ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని మెజార్టీ ప్రజలు చెబుతున్నారంటూ విమర్శించారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అబద్ధాల పునాదుల మీద రేవంత్‌రెడ్డి

మిగతా.. 2లో



## మహారాష్ట్రలో

# నేడే పోలింగ్


- 288 స్థానాలకు పోటాపోటీ
- అన్ని ఏర్పాట్లు చేసిన ఎన్నికల సంఘం
- వర్లి నియోజకవర్గంలో ఆసక్తికర పోటీ

ముంబై,నవంబర్19(నమస్తే ఉదయం): మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఒక 'మినీ' సంగ్రామాన్ని తలపించింది. ఆరు ప్రధాన పార్టీలు, ఆ పార్టీలకు చెందిన రాష్ట్ర, కేంద్ర అగ్రనేతల హోరాహోరీ ప్రచారంతో ఇక్కడ తీవ్ర ఉత్కంఠనెలకొంది. 288 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నవంబర్ 20న బుధవారం పోలింగ్ జరగనుంది. అధికార

మిగతా.. 2లో

## రెగ్యులరైజ్ జీవో 16 కొట్టివేత

- కాంట్రాక్ట్ ఉద్యోగులకు హైకోర్టు షాక్
- క్రమబద్ధీకరణ రాజ్యాంగ విరుద్ధమని వెల్లడి
- రెగ్యులరైజేషన్‌కు వ్యతిరేకంగా కోర్టుకు ఎక్కిన నిరుద్యోగులు




హైదరాబాద్,నవంబర్19(నమస్తే ఉదయం): కాంట్రాక్ట్ ఉద్యోగులకు హైకోర్టు షాకిచ్చింది. వారి రెగ్యులరైజేషన్ చెల్లదని తీర్పునిచ్చింది. రెగ్యులరైజ్ అయిన కాంట్రాక్ట్ ఉద్యోగులకు తెలంగాణ హైకోర్టు షాకిస్తూ...సెక్షన్ 10ఏ ప్రకారం తీసుకొచ్చిన జీవో 16ను తెలంగాణ హైకోర్టు మంగళవారం నాడు కొట్టివేసింది. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయడం రాజ్యాంగ విరుద్ధం అని హైకోర్టు స్పష్టం చేసింది. జీవో 16 ద్వారా గత బిఆర్ఎస్ ప్రభుత్వం వేలాది మందిని రెగ్యులరైజ్ చేసింది. ముఖ్యంగా విద్య, వైద్య శాఖల్లోనే ఎక్కువ మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించింది. తాజాగా హైకోర్టు సంచలన తీర్పుతో రెగ్యులరైజ్ అయిన కాంట్రాక్ట్ ఉద్యోగుల భవితవ్యం మళ్లీ ఆందోళనలో పడింది. బీఆర్ఎస్ ప్రభుత్వం రెగ్యూలరైజ్ చేసిన ఉద్యోగులను తిరిగి కాంట్రాక్ట్ ఉద్యోగులుగా కొనసాగించాల్సి ఉంటుందని హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందని పిటిషనర్లు తెలిపారు. అయితే దీనిపై హైకోర్టు నుంచి తమకు ఆర్డర్ కాపీ వస్తే స్పష్టత వస్తుందని అధికారులు చెబుతున్నారు.

మిగతా.. 2లో

## కొడంగల్ పాకిస్తాన్

# సరిహద్దుల్లో ఉందా..?

- లగచర్ల.. చైనా సరిహద్దుల్లోని కల్లోలిత ప్రాంతమా..?
- అర్ధరాత్రి గిరిజన ఆడబిడ్డలపై దమనకాండ
- మహిళా సంఘాల నేతలపైనా దౌర్జన్యమా?
- వాళ్ళని కాంగ్రెస్ ఎందుకు అడ్డుకుంటోంది..?
- వాస్తవాలను తొక్కిపెట్టాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది..?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు
- కాంగ్రెస్ అసమర్థ పాలనతో నిత్యం ఆత్మహత్యలు



హైదరాబాద్,నవంబర్ 19 (నమస్తే ఉదయం): సీఎం రేవంత్ రెడ్డి సొంత ఇలాకాలో ఇంతటి నిర్బంధం ఏమిటి..? కొడంగల్ ఏమైనా పాకిస్తాన్ సరిహద్దుల్లో ఉందా? లేక లగచర్ల.. చైనా సరిహద్దుల్లో ఉన్న కల్లోలిత ప్రాంతమా..? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. లగచర్లకు వెళ్తున్న మహిళా సంఘాల నేతలపై పోలీసులు దౌర్జన్యం ప్రదర్శించిన సంగతి తెలిసిందే. ప్రజా సంఘాలకు చెందిన మహిళా నేతలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ ఘటనపై కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. లగచర్లలో

మిగతా.. 2లో



## రాత్రివేళ కనిష్ట ఉష్ణోగ్రతలు..

- తెలుగు రాష్ట్రాలను వణికిస్తున్న చలి
- రెండురోజులుగా ఉష్ణోగ్రతలో మార్పులు
- డిసెంబర్-జనవరి నాటికి తీవ్రమయ్యే అవకాశం

హైదరాబాద్,నవంబర్ 19 (నమస్తే ఉదయం): తెలుగు రాష్ట్రాలను చలి వణికిస్తోంది. రెండురోజులుగా ఉష్ణోగ్రతలో మార్పులు చోటు చేసుకున్నాయి. రాత్రివేళ కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవు తున్నాయి. రాబోయే కొద్దివారాలు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశముందని

మిగతా.. 2లో

## 25 నుంచి పార్లమెంట్

# శీతాకాల సమావేశాలు

- 24న అఖిలపక్ష పార్టీల భేటీ: కిరన్ రిజిజు



న్యూఢిల్లీ,నవంబర్19(నమస్తే ఉదయం): పార్లమెంటు శీతాకాల సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. ఈ నెల 25 నుంచి డిసెంబర్ 20 వరకు సమావేశాలు కొనసాగనున్నాయి. డిసెంబరు 20 వరకు సమావేశాలు జరపాలని నిర్ణయించినట్లు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. సమావేశాల్లో భాగంగా 24న అఖిలపక్ష భేటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పార్లమెంట్‌అనెక్స్‌లో ఈ భేటీ ఉంటుంది. పార్లమెంట్ సమావేశాలకు ముందు అఖిలపక్ష భేటీ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సమావేశాల్లో నిర్మాణాత్మక చర్చ ఉంటుందని భావిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశాల్లో పలు బిల్లులు, అంశాలపై చర్చిస్తామన్నారు. నిర్మాణాత్మక చర్చ కోసం ఎదురు చూస్తున్నామని పేర్కొన్నారు. నవంబర్ 24న కేంద్రం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. పార్లమెంట్ హౌస్ అనెక్స్‌లో ఉదయం 11 గంటలకు ఈ సమావేశం జరగనుందని పార్లమెంటరీ

మిగతా.. 2లో

## కాగ్ అధిపతిగా తెలుగు వ్యక్తి సంజయ్‌మూర్తి

(మొదటి పేజీ తరువాయి)

యుద్ధం జరుగుతుంది. సింపుల్ చెప్పాలంటే ఇది చాలా కీలకమైన పదవి కూడా. ఇలాంటి వాటికి అధిపతి కావాలని చాలామంది ఐఏఎస్‌లు ఉవ్విళ్లూరుతారు. కొందరి మాత్రమే అలాంటి అదృష్టం వరిస్తుంది. అలాంటి వారిలో తెలుగు వ్యక్తి సంజయ్‌మూర్తి ఒకరు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకి చెందినవారు కె. సంజయ్ మూర్తి. ఆయన తండ్రి కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ కెవిఎస్ఆర్ మూర్తి. 1964లో జన్మించిన సంజయ్ మూర్తి, మెకానికల్ విభాగంలో ఇంజనీరింగ్ చదివారు. 1989లో ఐఏఎస్ అధికారిగా హిమాచల్‌ప్రదేశ్ కేడర్‌కు ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆయన కేంద్ర సర్వీసుల్లో పని చేస్తున్నారు. మూడేళ్ల కిందట అంటే 2021లో జాతీయ ఉన్నత విద్యా కార్యదర్శిగా పని చేశారు సంజయ్. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానం అమలులో తనవంతు పాత్ర పోషించారాయన. వచ్చే నెలలో ఆయన పదవీ విరమణ చేయాల్సిఉంది. ఈలోగా అదృష్టం ఆయనను వరించింది. సంజయ్‌మూర్తి సేవలను గమనించిన కేంద్రం, ఆయనకు కీలక బాధ్యతలు అప్పగించింది. కాగ్ అధిపతి పదవి చేపడుతున్న తొలి తెలుగు వ్యక్తి ఆయనే. ఇందులో నియమితులైనవారు ఆరేళ్ల వరకు అందులో కొనసాగే వీలుంది. అన్నట్లు సంజయ్‌మూర్తి తండ్రి కూడా ఐఏఎస్ అధికారే.

## కాలుష్యంతో ఇబ్బందులు

(మొదటి పేజీ తరువాయి)

తీసుకొచ్చామన్నారు. కాలుష్యాన్ని తగ్గించాలంటే ప్రజలు 15 సంవత్సరాలు దాటిన వాహనాలు స్వచ్ఛందంగా స్క్రాప్ చేపించాలని అన్నారు. హైబ్రిడ్ వాహనాలపై కూడా పన్ను రాయితీపై ఆలోచిస్తున్నామన్నారు. ప్రజలు ఈవీ వాహనాలు కొనండి అన్నారు. రవాణా శాఖ ఎన్ఫోర్స్మెంట్ అధికారులకు ఆదేశాలు కాలుష్యాన్ని వెదజల్లే వాహనాలపై కఠినంగా వ్యవహరించాలన్నారు.

## మహారాష్ట్రలో నేడే పోలింగ్

(మొదటి పేజీ తరువాయి)

మహాయుతి కూటమి, విపక్ష మహా వికాస్ అఘాడి మధ్య పోటీ నువ్వా-నేనా అన్న రీతిలో ఉండనున్న నేపథ్యంలో ఓటర్లు తమ ఓటును వినియోగించుకోబోతున్నారు. ఎన్‌డిఎ కూటమి మళ్లీ అధికారంలోకి వస్తుందని ప్రధాని మోడీ ధీమాగా ఉన్నారు. ఈ క్రమంలో పోలింగ్ కోసం ఎన్నికల సంఘం భారీగా ఏర్పాట్లు చేసింది. ఉద్యోగులు తమ సామాగ్రిని తీసుకుని ప్రత్యేక వాహనాల్లో తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాకు చేరుకున్నారు. ప్రధానంగా 5 నియోజకవర్గాల పైనే అందరి దృష్టి నెలకొంది. ఇక్కడ పోటీ మహా సంగ్రామాన్నే తలపించనుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. వర్లి నియోజకవర్గంలో త్రిముఖ పోటీ నెలకొంది. ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని శివసేన అభ్యర్థిగా మిలంద్ దేవర పోటీ చేస్తుండగా, ఉద్ధవ్ థాకరే శివసేన తరఫున ఆయన కుమారుడు ఆదిత్య థాకరే బరిలో ఉన్నారు. మహారాష్ట్ర నవనిర్మాణ సేన నేత సందీప్ దేశ్‌పాండే సైతం తన అదృష్టం పరీక్షించుకుంటున్నాడు. సౌత్ ముంబై మాజీ ఎంపీ అయిన మిలంద్ దేవర అర్బన్ మిడిల్ క్లాస్ ఓటర్లపైనే ప్రధానంగా దృష్టి సారించారు. యూపీఏ-2 ప్రభుత్వంలో ఆయన సమాచార, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, షిప్పింగ్ శాఖ సహాయ మంత్రిగా కూడా పనిచేశారు. ఇక ఆదిత్య థాకరే 2019లో ఎన్నికల్లోకి అడుగుపెట్టి వర్లి నియోజకవర్గం నుంచి 89,248 ఓట్ల ఆధిక్యంతో ఘనవిజయం సాధించారు. కోవిడ్-19 సమయంలోనూ ఆదిత్య అందించిన సేవలకు మంచిపేరు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రుల్లో కోవిడ్ పాజిటివ్ పేషెంట్ల అడ్మిషన్ వ్యవహారాలను స్వయంగా ఆయన పర్యవేక్షిస్తూ వచ్చాయి. వర్లిలో మహా నవనిర్మాణ సేనకు పెద్దగా ఓటర్ల బలం లేకున్నప్పటికీ స్థానిక సమస్యలను పరిష్కరించడంలో సందీప్ దేశ్‌పాండేకు మంచి పేరుంది. ముఖ్యంగా మరాఠీ మాట్లాడే ఓటర్లలో ఆయనకు గుర్తింపు ఉంది.

## కొడంగల్ పాకిస్తాన్ సరిహద్దుల్లో ఉందా..?

(మొదటి పేజీ తరువాయి)

అర్ధరాత్రి గిరిజన ఆడబిడ్డలపై దమనకాండే కాదు.. పట్టపగలు వెళ్లిన మహిళా సంఘాల నేతలపైనా దౌర్జన్యమా..? అని కేటీఆర్ మండిపడ్డారు. నిజనిర్ధారణకు వెళ్లిన వారిని కాంగ్రెస్ ఎందుకు అడ్డుకుంటోంది..? వాస్తవాలను తొక్కిపెట్టాలని ఈ సర్కారు ఎందుకు ప్రయత్నిస్తోంది..? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఇంటర్‌నెట్ సేవలు నిలిపివేశారు. కొడంగల్‌కు వెళ్లే అన్ని దారుల్లో పోలీసుల పహారా ఏర్పాటుచేశారని కేటీఆర్ తెలిపారు.
మీరెంత దాచే ప్రయత్నం చేసినా నిజం దాగదు.. ఇప్పటికే లగచర్లలో కాంగ్రెస్ సర్కారు కిరాతకం ఢిల్లీకి చేరింది. దేశ రాజధానిలో మీ అరాచకపర్వంపైనే తీవ్ర చర్చ జరుగుతోంది. ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీలను అడ్డుకోవడం అంటేనే.. కాంగ్రెస్ సర్కారు తప్పుచేసినట్టు ఒప్పుకున్నట్టే లెక్క అని కేటీఆర్ పేర్కొన్నారు. మహిళా సంఘాలను అడ్డుకున్నందుకు క్షమాపణలు చెప్పాలి. లగచర్లలో నిర్బంధాన్ని ఎత్తివేసి.. ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలి అని కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అసమర్ధ పాలన కారణంగా ఆర్థికంగా చితికిపోయి రైతులు, ఆటోడ్రైవర్లతోపాటు వివిధ వర్గాలకు చెందిన వారు నిత్యం ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. దీనిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా కవితాత్మంగా, తీవ్రంగా స్పందించారు. రోజుకో చావుతో తెలంగాణ తెల్లారుతోందని, కాంగ్రెసోడి కుట్రలకు బలైపోతున్నదని మండిపడ్డారు. రాజ్యహింసతో రాష్ట్రం నిత్యం తల్లడిల్లుతోందని, గాయాలతో గోడుగోడునా విలపిస్తోందని విమర్శించారు. రైతు రారాజుగా బ్రతికిన తెలంగాణలో అన్నదాతల ఆత్మహత్యలు నిత్యకృత్యమాయెనని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధికి చిరునామాగా మారిన రాష్ట్రంలో జీవనోపాధి కరువై బడుగులు బలిపీఠం ఎక్కవట్టెనని ఆయన వాపోయారు. ఇది ఎవడు చేసిన పాపమని, ముమ్మాటికీ మార్పు తీసుకొచ్చిన శాపమేనని పేర్కొన్నారు. తన పోస్టుకు ఓ రైతు, ఓ ఆటోడ్రైవర్ ఆత్మహత్యలకు సంబంధించిన పేపర్ క్లిప్పింగ్‌లను జతచేశారు.

## రెగ్యులరైజ్ జీవో 16 కొట్టివేత

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ సెక్షన్ 10ఏ ప్రకారం జీవో 16ను కెసిఆర్ ప్రభుత్వం తీసుకుని వచ్చింది. డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ కళాశాలల్లో లెక్చరర్లను గతంలో ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించారని.. ప్రభుత్వ నిర్ణయాన్ని నిరుద్యోగులు హైకోర్టులో సవాల్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పునకు ఇది విరుద్ధమని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోర్టుకు వివరించారు. విచారణ చేపట్టిన హైకోర్టు జీవోను రద్దు చేస్తూ తీర్పు ఇచ్చింది. రాష్ట్రంలోని మొత్తం 40 విభాగాల్లో ఉన్న 5,544 కాంట్రాక్టు ఉద్యోగులను గత ప్రభుత్వం క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో 2,909 మంది జూనియర్ లెక్చరర్లు, 184 మంది జూనియర్ లెక్చరర్లు(ఒకేషనల్), 390 మంది పాలిటెక్నిక్, 270 మంది డిగ్రీ లెక్చరర్లు, సాంకేతిక విద్యాశాఖలో 131 మంది అటెండర్లు, వైద్య ఆరోగ్య శాఖలోని 837 మంది వైద్య సహాయకులు, 179 మంది ల్యాబ్ టెక్నీషియన్లు, 158 మంది ఫార్మాసిస్టులు, 230 మంది సహాయ శిక్షణ అధికారులు ఉన్నారు. ఎన్నో ఏళ్లుగా సగం జీతానికే సేవలు అందిస్తున్నట్లుగుర్తించిన గత ప్రభుత్వం వారి సేవలను గుర్తించి జివో 16 ద్వారా రెగ్యులరైజ్ చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సైతం కాంట్రాక్ట్ ఉద్యోగుల సేవల్ని గుర్తించి, వారి ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడానికి సెక్షన్ 10ఏ ప్రకారం జీవో 16 తీసుకొచ్చింది. దీని ప్రకారం కాంట్రాక్ట్ ఉద్యోగులను కేసీఆర్ ప్రభుత్వం పర్మినెంట్ చేసి వారి కుటుంబాల్లో వెలుగులు నింపింది. అయితే నియామక పరీక్షలు నిర్వహించి ఖాళీలను భర్తీ చేయాలి కానీ, నేరుగా వారిని రెగ్యూలరైజ్ చేయడం రాజ్యాంగ విరుద్ధం అంటూ దాఖలైన పిటిషన్లను ధర్మాసనం మంగళవారం విచారించింది. కాంట్రాక్ట్ ఉద్యోగుల్ని పర్మినెంట్ చేయడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోను హైకోర్టు కొట్టివేసింది. దాంతో రెగ్యూలరైజ్ అయిన ఉద్యోగులు మళ్లీ కాంట్రాక్ట్ ఉద్యోగులుగా మారను న్నారు. ఏళ్ల తరబడి పడుతున్న వారి కష్టాలు మళ్లీ మొదటికొచ్చాయని చెబుతున్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజ్ ద్వారా నిరుద్యోగులుగా ఉన్న తమకు ఉద్యోగాలు దక్కకుండా పోయాయని నిరుద్యోగులు ఆరోపిస్తూ పిటిషన్ వేశారు. దీంతో ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో అని కాంట్రాక్ట్ ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు.

# హామీల చర్చపై రేవంత్ సవాలును స్వీకరిస్తున్నా

(మొదటి పేజీ తరువాయి)

పాలన కొనసాగిస్తున్నారని, ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని ప్రజలు చర్చించుకుంటున్నారని అన్నారు. హామీల చర్చపై రేవంత్ సవాలును స్వీకరిస్తున్నా. నీ హామీల అమలుపై చర్చకు మోడీ ఎందుకు? ఇక్కడ మేము ఉన్నాం. ఎక్కడ చర్చకు రావాలో రేవంత్ చెప్పాలి. మేము సిద్ధంగా ఉన్నాం. నీ ఆరు గ్యారంటీలే కాదు 420 హామీలపై చర్చిద్దామని ఈటల రాజేందర్ అన్నారు. గత ప్రభుత్వం ముచ్చర్లలో ఫార్మాసిటీకోసం 19వేల ఎకరాలు భూ సేకరణ చేసేందుకు ప్రయత్నించింది. ఫార్మాసిటీలను రద్దు చేస్తాని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపర్చింది. ఫోర్త్ సిటీకోసం 30వేల ఎకరాలు అంటున్నారు. ఫోర్త్ సిటీ కోసం రైతుల పొట్ట కొడుతున్నారు. ఫార్మా సిటీ రద్దు అన్నారు.. కొడంగల్‌లో ఎందుకు రాద్ధాంతం చేస్తున్నారు.

లగచర్లలో మా మీద దాడి జరగలేదని కలెక్టరే చెబుతున్నారు. అయినా, రైతులను నానా హింసలకు గురి చేస్తున్నారు. ఎనిమిది నెలలుగా నిరసన తెలుపుతున్న వారిని గుర్తించి పోలీసులు వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. లగచర్ల రైతులు నక్సలైట్లా వాళ్లేమైనా సంఘ విద్రోహ శక్తులా అంటూ ప్రశ్నలు కురిపించారు. నర్మదా, సబర్మతి నదుల్లాగే మూసీ అభివృద్ధి జరగాలి.. అందుకు స్పష్టమైన ప్రణాళిక ఉండాలి. మూసీ ఇరువైపులా ఇళ్లను కూల్చి భూములను రియల్ ఎస్టేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన సంబరాలపై ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. ముచ్చర్లలో గత ప్రభుత్వం 14 వేల ఎకరాలు భూసేకరణ చేశారు. ఆ భూములు పోగొట్టుకున్న రైతులు కూలీలుగా మారారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో లో ఫార్మా సిటీ రద్దు చేసి.. రైతులకు తిరిగి భూమి ఇస్తామని చెప్పారు. ఫోర్త్ సిటీ పేరుతో 14 వేల ఎకరాలకు తోడుగా మరో 16 వేలు సేకరించాలని ప్రభుత్వం భావిస్తోంది. రియల్ ఎస్టేట్ పేరుతో రైతుల భూములు లాక్కోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. కొడంగల్ లో రైతులు భూమి ఇవ్వలేమని కాళ్ళు మొక్కినా బెదిరించి సెకరించే ప్రయత్నం చేస్తున్నారు. స్వయంగా కలెక్టర్ నాపై దాడి జరగలేదని చెప్పారు. లగచర్ల చుట్టూ పక్కల గ్రామాలకు మాత్రమే సమస్య కాదు.. ప్రతీ రైతు రేపటి రోజున మాకు సమస్య వస్తుందని భయపడుతున్నారు. రైతులపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. రైతులు నక్సలైట్లు కాదు.. వేరే వాళ్ళ భూములు అడగడం లేదు.. రేవంత్ రెడ్డిది మా కొడంగల్ కాకపోయినా గెలిపిస్తే మమల్ని హింసిస్తున్నారని రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఎంతో మంది ముఖ్యమంత్రులను చూశాం.. కానీ రేవంత్ లా ప్రజలను ఇంతగా ఎవరు హింసించలేదు. మూసీ పక్కన ఉన్న భూములను లాక్కొని.. కార్పొరేట్ కంపెనీలకు ఇచ్చి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలని చూస్తున్నారు.

ఒక వైపు హైడ్రా కూల్చివేతలు.. మరోవైపు లగచర్ల లాంటి ఘటనలు జరుగుతుండగా ఇంకోవైపు ప్రభుత్వం సంబరాలు చేసుకుంటున్నారని ఈటెల విమర్శలు చేశారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఇచ్చిన హామీలు నెరువుతున్నాయా అనేది ముఖ్యమంత్రే చెప్పాలి. ప్రధాని మోదీని విమర్శించే స్థాయి సీఎంకు ఉందా రైతులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి. మీ మేనిఫెస్టో ఏమయ్యింది. మహిళలు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి. ఆర్టీసీ కార్మికులకు పీఆర్సీ ఇస్తామన్నారు..

ఇచ్చారా... రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక అత్యధికంగా ఆత్మహత్యలు చేసుకుంటున్నది ఆటో డ్రైవర్లు. బెల్టు షాపులు రద్దు చేస్తామన్నారు ఏమైందన్నారు. రాష్ట్రంలో లిక్కర్ ఏరులై పారుతోంది. రాష్ట్ర ప్రజలకు ఏమిచ్చారని సంబరాలు చేసుకుంటున్నారని ఈటల రాజేందర్ ప్రశ్నించారు. రేవంత్ ! నీ స్థాయి ఎంత మహారాష్ట్ర వెళ్లి ప్రధానిపై ఇష్టారాజ్యంగా మాట్లాడు తున్నావు. ప్రజాక్షేత్రంలో ఒకలా. ! ఢిల్లీ వెళ్లి మోదీని కలిసినప్పుడు మరోలా వ్యవహరిస్తున్నావు. ఏ వర్గాన్ని వదలకుండా అన్ని వర్గాల ప్రజలను రేవంత్ మోసం చేశాడని మండిపడ్డారు. నెలనెలా నాలుగు వేల రూపాయలు ఇస్తానని చెప్పిన నిరుద్యోగ భృతి ఏమైంది ? ఆర్టీసీ కార్మికులకు ఇస్తామని చెప్పిన రెండు పెండింగ్ పీఆర్సీలు ఎందుకు ఇవ్వడం లేదు. కడుపు నొప్పి లేస్తే టాబ్లెట్ దొరకదు.. కానీ కిరాణా కొట్టులో మాత్రం లిక్కర్ దొరుకుతుంది. హామీలు నెరవేర్చకుండా.. ఏ ముఖం పెట్టుకొని ప్రజల్లోకి వెళ్లాలని కాంగ్రెస్ మంత్రులే అంటున్నారు. రేవంత్ రెడ్డి భూమి మీదకు వచ్చి మాట్లాడాలి. చట్టాన్ని మరిచిపోయి బాసుల మాట వింటున్న అధికారులు భవిష్యత్తు పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. భూములు లాక్కోవడానికి నీ అయ్య జాగీరు కాదని హెచ్చరించారు.. రేవంత్ అధికారంలోకి వచ్చాక ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. గతంలో సర్పంచ్ లు, ఎంపీటీసీలుగా పనిచేసిన వారు బిల్లుల కోసం పోతే పది శాతం కమిషన్ తీసుకుంటున్నారని దుయ్యబట్టారు.

## రాత్రివేళ కనిష్ట ఉష్ణోగ్రతలు..

(మొదటి పేజీ తరువాయి)

వాతావరణ శాఖ తాజా హెచ్చరిక డిసెంబర్-జనవరి నాటికి తీవ్రమయ్యే అవకాశం ఉందని తెలిపింది. కొన్ని జిల్లాల్లో 6 నుంచి 7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ అధికారుల మాట. ఏపీలోని ఉమ్మడి విశాఖ జిల్లా విషయానికొస్తే.. మన్యంలో ఉష్ణోగ్రతలు రోజురోజుకి పడిపోతున్నాయి. ప్రస్తుతం 11 మండలాలను చలి వణికిస్తోంది. రాబోయే రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. పాడేరు, అరకు, లంబసింగి వంటి ప్రాంతాల్లో రాత్రి వేళ ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కి పడిపోయాయి. అరకులో 8. 9 డిగ్రీలు, దుంబ్రిగూడ లో 9.7, మాడుగులలో 10 డిగ్రీలు, ముంచంగిపుట్టు, హుకుంపేటలో 10.9 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. ఆయా ప్రాంతాల్లో ఉదయం 10 గంటల వరకు సూర్యుడు కనిపించలేదు. సాయంత్రం నాలుగు గంటల నుంచి చలి మొదలవుతోంది. మన్యం ప్రాంతంలో ఉష్ణోగ్రతలు తగ్గడంతో సెల్‌ఫోన్ సిగ్నల్స్ సమస్యగా మారింది. సెల్ సిగ్నల్స్ రాక ఇబ్బందులు పడుతున్నారు పర్యాటకులు. రాత్రివేళ తక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు చలి మంటలు వేస్తున్నారు. తెల్లవారుజాము నుంచే రోడ్లపై పొగమంచు కమ్మేస్తోంది. చాలా చోట్ల పగటి వేళ వాహనదారులు లైట్లు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. తెలంగాణ విషయానికొస్తే.. రెండురోజులుగా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చలి తీవ్రత పెరిగింది. రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్ 10 నుంచి 12 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. పటాన్‌చెరులో 12.4 డిగ్రీలకు పడిపోయింది. తెలంగాణ అంతటా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. రాజన్న సిరిసిల్లలోని వీర్నపల్లిలో రాష్ట్రంలో అత్యల్ప ఉష్ణోగ్రత 13.9 డిగ్రీలు నమోదు కాగా, కనిష్ట ఉష్ణోగ్రత 12.0 డిగ్రీలుగా ఉంది. రాబోయే కొన్ని వారాల పాటు చలిగాలులు కొనసాగుతాయని ఐఎండీ అంచనా వేసింది. కొమురం భీం జిల్లా సిర్పూర్ లో 10.5 ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా పొచ్చెరలో 11.8 డిగ్రీలుగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కాగా.. నిర్మల్ జిల్లా కుంటాలలో 12.6 డిగ్రీలు కాగా.. ఇక మంచిర్యాల జిల్లా ర్యాలీ లో 13.1 గా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయింది. మిగతా జిల్లాల్లోనూ చలిగాలులు వీస్తున్నాయి. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లోనూ కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మూడు రోజులుగా రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో చలి గాలుల తీవ్రత పెరిగింది. రంగారెడ్డి జిల్లా చౌదరిగూడెంలో 12.2 డిగ్రీలు, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, షాబాద్‌లో 12.6 డిగ్రీలు, మేడ్చల్ జిల్లా మూడు చింతలపల్లిలో 13.8 డిగ్రీలు, కుత్బుల్లాపూర్, సమీర్‌పేటలో 14.4 డిగ్రీలు, అత్యల్పంగా 12.2 డిగ్రీలు, వికారాబాద్ జిల్లా మన్నెగూడలో 12.2, వికార్‌బాద్‌లో 12.7 డిగ్రీల ఉష్ణోగ్రత అత్యల్పంగా నమోదైంది. ఇక రాజధాని నగరం హైదరాబాద్‌లోనూ చలి తీవ్రత పెరుగుతోంది. శివారు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. పలు ప్రాంతాల్లో 12 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. చలి తీవ్రత పెరగడంతో మార్నింగ్ వాకింగ్ చేసే వారి సంఖ్య తగ్గుతోంది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఇక ఏపీలోనూ చలి తీవ్రత పెరుగుతోంది. పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఏజెన్సీలో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. ముంచింగిపుట్టులో 9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. పాడేరులో 12 డిగ్రీలు, మినుములూరులో 10 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పగటిపూట ఎండ ఉన్నప్పటికీ రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. పెరుగుతున్న చలి దృష్ట్యా చిన్నారులు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. అత్యవసరమైతేనే రాత్రి, తెల్లవారుజామున బయటకు వెళ్లాలని చెబుతున్నారు. శీతాకాలం తీవ్రతరం అయ్యే కొద్దీ ఉష్ణోగ్రతలో మరింత పడిపోవచ్చని చెబుతోంది. మున్ముందు విపరీతమైన చలిని ఎదుర్కొనేందుకు నగర వాసులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది.

# 25 నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

(మొదటి పేజీ తరువాయి)

వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజుజు మంగళవారం ప్రకటించారు. పార్లమెంట్ ఉభయసభల్లోని అన్ని రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్లను సభా వ్యవహారాలపై చర్చించేందుకు కేంద్రం సమావేశానికి ఆహ్వానించింది. సభ సజావుగా సాగడంతో పాటు ముఖ్యమైన అంశాలపై భేటీలో చర్చించే అవకాశం ఉన్నది. నవంబర్ 25 నుంచి డిసెంబర్ 20 వరకు పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నిర్వహించనున్నట్లు కేంద్రం ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. అదేవిధంగా రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏండ్లు పూర్తయిన సందర్భంగా సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో ఈ నెల 26న ప్రత్యేక వేడుకలు జరగనున్నాయి. 1949 నవంబర్ 26న రాజ్యాంగ సభ మన రాజ్యాంగాన్ని ఆమోదించిన న్యూఢిల్లీలోని సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో ఉభయ సభల సభ్యులు సమావేశం కానున్నారు.

కాగా ఇదివరకూ నవంబర్ 26ను జాతీయ న్యాయ దినోత్సవంగా నిర్వహించే వారు. కానీ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 125వ జయంతిని పురస్కరించుకొని 2015 నుంచి నవంబర్ 26ను కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ దినోత్సవంగా ప్రకటించిన విషయం తెలిసిందే. మరోవైపు ఈ శీతాకాల సమావేశాల్లో జమిలి ఎన్నికలు, వక్ఫ్ సవరణ బిల్లు మొదలైనవి సభ ముందుకు రాబోతున్నట్టు తెలిసింది. ఈ సమావేశాల్లోనే వక్ఫ్ సవరణ బిల్లును ఆమోదింపజేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇప్పటికే ప్రకటించారు. గురుగావ్ ఎన్నికల ప్రచారంలోనూ ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. మరోవైపు విపక్షాలు జమిలి ఎన్నికలు, వక్ఫ్ సవరణ బిల్లు-2024ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. దీంతో విపక్షాలు, అధికార ఎన్డీయే కూటమి సభ్యుల మధ్య పార్లమెంట్‌లో వాడి వేడి చర్చ సాగే అవకాశం ఉంది.





# బీఆర్ఎస్ నేతలు కుట్రలు చేస్తే... జైలుకే

ఎందుకు నిర్వర్తించడం లేదని నిలదీశారు. రాష్ట్ర ఆదాయం నెలకు రూ. 18500 కోట్లలో రూ. 6500 కోట్లు జీతాలు రూపంలో.. మరో రూ. 6000 కోట్లు కేసీఆర్ చేసిన అప్పులకు వడ్డీ రూపంలో పోతున్నాయని తెలిపారు. దీనిపై అసెంబ్లీలో చర్చ పెడదాం రావాలని కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్‌కు సవాల్ విసిరారు. నువ్వు అసెంబ్లీకి రావు.. ఇద్దరు

చిల్లరగాళ్ళను వదిలావని కేటీఆర్, హరీష్ రావుపై ఘాటు విమర్శలు చేశారు. అభివృద్ధిని అడ్డుకోవాలని ఎవరైనా కుట్రలు కుతంత్రాలు చేస్తే జైల్లో పెట్టీ ఊచలు లెక్క పెట్టిస్తామని హెచ్చరించారు. 11 నెలల్లోనే ప్రజలు ఏం కోల్పోయారో వాళ్లకు తెలిసొంచ్చిదన్న కేసీఆర్ వ్యాఖ్యలకు సైతం కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్ మీరు ఫామ్ హౌజ్‌లోనే ఉండండి.. ప్రజలు ఏం కోల్పోలే.. మీ ఇంట్లో నలుగురి పదవులు మాత్రం పోయాయని రివర్స్ కౌంటర్ ఇచ్చారు. దీంతో 50వేలమందికి ఉద్యోగాలు వచ్చాయని అన్నారు. బీఆర్ఎస్ అధికారం దిగిపోతే కేసీఆర్, కుటుంబ సభ్యుల ఉద్యోగాల ఊడాయి తప్ప.. రాష్ట్రానికి ఏం కాలేదు. కేసీఆర్.. హాయిగా మీరు ఫామ్ హౌస్‌లో పడుకోండి. అవసరమైతే అక్కడే వైన్ షాప్ ఏర్పాటు చేయిస్తా. మీ ఉద్యోగాలు పోయాయి కాబట్టి రైతులకు రుణమాఫీ జరుగుతోంది. ఇంకా కొంతమందికి సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ జరగలేదు. కచ్చితంగా చేసి తీరుతాం. అభివృద్ధిపై చర్చకు బిర్లా-రంగాలు సిద్ధమా..? రైతు రుణమాఫీ చేస్తే అభినందించాల్సిందిపోయి విమర్శిస్తున్నారు. వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అనలేదా?. ఆయన ఏం చెప్పాలనుకుంటున్నారో అసెంబ్లీకి వచ్చి చెప్పాలి. నువ్వు ఎప్పుడంటే అప్పుడు అసెంబ్లీ పెట్టిస్తా. కేసీఆర్ ప్రజల్లోకి వచ్చి మాట్లాడాలి. ఆయన రాకుండా ఇద్దరు చిల్లరగాళ్లను పంపుతున్నారని మండిపడ్డారు. వరంగల్‌ను అభివృద్ధి చేస్తే సగం తెలంగాణను వృద్ధిలోకి తీసుకొచ్చినట్లేనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఉత్తర తెలంగాణకే తలమానికంగా వరంగల్ ను అభివృద్ధి చేస్తామన్నారు. వరంగల్ జిల్లా మంత్రి, ఇన్‌ఛార్జ్ మంత్రి పట్టుబట్టి అభివృద్ధి పనులను సాధించుకున్నారని చెప్పారు. విమానాశ్రయంతో వరంగల్ రూపురేఖలు మారనున్నాయన్నారు. చాలా రాష్ట్రాల్లో నాలుగైదు విమానాశ్రయాలు ఉన్నాయని.. తెలంగాణలో మాత్రం ఇప్పటివరకు ఒకేఒక ఎయిర్‌పోర్టు ఉందన్నారు. ఇందిరమ్మ రాజ్యం రావాలని ప్రజలంతా కోరుకున్నారని.. తమను దీవించి పదవులిచ్చిన ప్రజలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆడబిడ్డలను కోటీశ్వరులుగా మార్చేందుకు ఈ ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. గత ప్రభుత్వంలో కొన్నేళ్లపాటు మహిళా మంత్రి కూడా లేరని గుర్తు చేశారు. కాళోజీ కళాక్షేత్రాన్ని పూర్తి చేసేందుకు గత ప్రభుత్వానికి పదేళ్లపాటు మనసొప్పలేదని, ఎంతో పట్టుదలతో కాళోజీ కళాక్షేత్రాన్ని పూర్తి చేశామన్నారు. వరంగల్ గడ్డ నుంచి రైతులందరికీ మరోసారి మాట ఇస్తున్నా. సాంకేతిక కారణాల వల్ల కొందరికి రూ. 2లక్షలలోపు రుణమాఫీ వర్తించలేదు. ఇచ్చిన మాట ప్రకారం రుణాలన్నీ మాఫీ చేస్తాం అని సీఎం ప్రకటించారు. తెలంగాణ గడ్డపై సూర్య, చంద్రులు ఉన్నంత వరకూ ఇందిరమ్మ రాజ్యంలో పేద ప్రజలు, ఆడబిడ్డలకు సంక్షేమ పథకాలు అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ఆడబిడ్డల ఆశీర్వాదంతోనే తాను టీపీసీసీ అధ్యక్షుడిగా, ముఖ్యమంత్రిగా ఎన్నిక అయ్యానని రేవంత్ రెడ్డి చెప్పారు. మీరు భుజాల మీద మోయబట్టే మేమంతా ఇవాళ వివిధ హోదాల్లో ఉన్నామని ముఖ్యమంత్రి చెప్పారు. అందుకే ఆడబిడ్డల రుణం తీర్చుకోవాల్సిన బాధ్యత మా ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీపై ఉంది. 2014 నుంచి 2019 వరకూ బీఆర్ఎస్ మంత్రివర్గంలో ఒక్క మహిళా మంత్రిగా లేరని ఆయన చెప్పారు. ప్రస్తుతం తెలంగాణ మహిళలు ఇచ్చిన తీర్పుతో మొదటి మంత్రివర్గంలోనే కొండా సురేఖ, సీతక్కకు మంత్రులుగా అవకాశం కల్పించామని సీఎం చెప్పుకొచ్చారు. ఈ ఓరుగల్లు ఆడబిడ్డలకే మంత్రివర్గంలో ప్రముఖస్థానం ఇచ్చి నేటి సభా నిర్వహణ కార్యక్రమాన్ని సైతం వారి చేతుల్లోనే పెట్టామని రేవంత్ తెలిపారు. ఇదే కాకుండా వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కడియం కావ్యను పార్లమెంట్‌కు పంపించామని ఆయన చెప్పారు. ఆమె తెలంగాణ సమస్యలపై పార్లమెంట్‌లో గళం విప్పుతోందని అన్నారు. పాలకుర్తిలో ఓ రాక్షసుడు రాజ్యమేలుతుంటే యశస్విని రెడ్డి అనే సోదరి ఆ

రాక్షసుడిని ఎన్నికల్లో ఓడించి పాలకుర్తి గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరవేసిందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తెలంగాణ చీఫ్ సెక్రటరీ కూడా ఆడబిడ్డనే అని ఆయన తెలిపారు. అనేక మంది మహిళా అధికారులు పలు జిల్లాలకు కలెక్టర్లుగా ఉన్నారని వెల్లడించారు. వరంగల్ కార్పొరేషన్ మేయర్‌గా కూడా ఓ మహిళలే ఉందని సీఎం చెప్పుకొచ్చారు. వారి రుణం ఇంకా తీర్చుకోవాల్సిన అవసరం ఉందని ప్రజాపాలన విజయోత్సవ సభలో రేవంత్ రెడ్డి చెప్పారు. తెలంగాణను అవమానించిన, వ్యతిరేకించిన ప్రధాని మోదీకి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఊడిగం చేస్తున్నారని రేవంత్ రెడ్డి విమర్శించారు. గెలిపించిన సికింద్రాబాద్ ప్రజలను కిషన్ రెడ్డి ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. గుజరాత్‌లో సబర్మతి సుందరీకరణను సమర్థించి.. మూసీ సుందరీకరణను ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో మంత్రులు భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి, శ్రీధర్ బాబు, పొంగులేటి, జూపల్లి, పొన్నంప్రభాకర్, కొండా సురేఖ, సీతక్క, ఎంపి కడియం కావ్య, కడియం శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



ఆర్.బి నగర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ మహేందర్ రెడ్డి

# మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

**మున్సిపల్ చైర్మన్ సుష్మ మహేందర్ రెడ్డి**

**ఆర్..బి. నగర్‌లో 15 లక్షల రూపాయలతో సిసి రోడ్ల పనులు ప్రారంభించిన సుష్మ మహేందర్ రెడ్డి, వైట్ చైర్మన్ గోపాల్ యాదవ్.**

**శంషాబాద్, నవంబర్ 19( నమస్తే ఉదయం):** శంషాబాద్ పురపాలక సంఘం పరిధిలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించడానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ కొలను సుష్మా మహేందర్ రెడ్డి వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్. మున్సిపల్ కమిషనర్ సుమన్ రావు . స్థానిక కౌన్సిలర్ దేవరంపల్లి పుష్పలత బుచ్చిరెడ్డి తెలిపారు. ఆర్ బి నగర్ కాలనీ లో వినాయక టెంపుల్ నుండి ఆర్.బి నగర్ బస్తీలోకి వెళ్లడానికి ఉన్న ప్రధాన రహదారి తో పాటు మరో రెండు రోడ్లను సిసి రోడ్లు గా మార్చడం కోసం 15 లక్షల రూపాయలతో చేపట్టిన పనులను మంగళవారం ప్రారంభించారు. ప్రతిరోజు వేలాది మంది తిరిగే ఈ రోడ్డు అడుగడుగునా గుంతలు పడి ఇబ్బంది కరంగా మారడంతో పునర్నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణం పూర్తి అయిన తర్వాత ఎవరు కూడ పైపులైన్ల కోసం ఇతరత్రా వాటి కోసం తొవ్వడం మంచి పద్ధతి కాదని రోడ్లను ధ్వంసం చేసినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగు తుందని హెచ్చరించారు. ప్రజల సంక్షేమం కోసం మునిసిపల్ చేసే పలు కార్యక్రమాలు 10 కాలాలపాటు నిలిచి ఉండాలంటే స్థానిక ప్రజలు వ్యాపారులు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కోనమోల్ల శ్రీనివాస్. జీ వై ప్రభాకర్. పాండురంగారెడ్డి నరేందర్ గౌడ్. విట్టల్ రెడ్డి. తదితరులు పాల్గొన్నారు.

# హిందూ ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత

**- ముచ్చింతల మాజీ సర్పంచ్ బీర్ల పెంటయ్య**



**శంషాబాద్, నవంబర్ 19(నమస్తే ఉదయం):** పవిత్రమైన హిందూ ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని శంషాబాద్ మండలం ముచ్చింతల గ్రామ మాజీ సర్పంచ్ బీర్ల పెంటయ్య పేర్కొన్నారు. భారతదేశం సనాతన ధర్మానికి నిలయమని యుగయుగాలుగా తరతరాలుగా వస్తున్న ఈ ధర్మాన్ని కాపాడుకోవడం మన అందరి బాధ్యత అని ఆయన సూచించారు. భూమి మీద ఉన్న ప్రతి జీవిలోనూ రాయిలోనూ దైవత్వాన్ని చూసు కునే గొప్ప సంస్కృతి సాంప్రదాయం మన పూర్వీకుల నుండి వస్తున్నదని అన్నారు. ఇతర మతాలను కించపరచకుండా మన ధర్మాన్ని కాపాడుకోవడం దానిని మరింత వ్యాప్తి చేయడం మన కర్తవ్యం అని పెంటయ్య సూచించారు. సనాతనమైన పవిత్రమైన హిందూ ధర్మాన్ని భావితరాల వారు కూడ పాటించేలా భావితరాల వారికి తెలిసే విధంగా ప్రతి హృదయానికి చేరే విధంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. విదేశాల్లో కూడ మన ధర్మానికి సంస్కృతికి ప్రజలు విశేషంగా ఆకర్షితులై ఆచరిస్తున్నారని తెలిపారు.

## గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా
# విద్యార్థినులకు ముగ్గుల పోటీలు

**గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 19(నమస్తే ఉదయం):** 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయంలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమా



నికి జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి గంట కవితాదేవి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు ముఖ్య అతిథిలు హాజరయ్యారు. విద్యార్థినులు వేసిన ముగ్గుల ప్రాముఖ్యతను జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి గంట కవితాదేవి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె గ్రంథాలయాల ప్రాముఖ్యతపై విద్యార్థినులకు వివరించారు. గ్రంథ పఠనాన్ని నిత్య జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ లు,, వివిధ పాఠశాలల విద్యార్థినులు పాల్గొన్నారు.

# స్కూటీలో ప్రత్యక్షమైన కట్ల పాము...

**గద్వాల టౌన్, నవంబర్ 19(నమస్తే ఉదయం):** పార్కు చేసిన ఓ స్కూటీలో ఓ పాము దూరింది. బండి తీయడానికి వెళ్లిన వాహనదారుడు సీటు కింద నుంచి కట్ల పాము



బయటకు రావడంతో భయంతో వదిలేసి దూరంగా వెళ్లాడు. వివరాల్లోకి వెళ్తే... గద్వాల పట్టణానికి చెందిన రషీద్ మంగళవారం తన స్కూటీ వాహనాన్ని బీరొల్లు చౌరస్తాలో పార్క్ చేశాడు. కొద్ది సేపటి తర్వాత స్కూటీని తీసి స్టార్ట్ చేయగా అందులో పాము ఉండటం గమనించాడు.

దీంతో భయపడి బండిని వదిలేసి దూరంగా వెళ్లాడు. స్థానికులకు సాయంతో స్కూటీ లో నుంచి పామును బయటికు తీసి, పామును చంపడం జరిగింది.



వరుడు ఎండి.అలీమ్‌ను ఆశీర్వదిస్తున్న గ్రామ నాయకులు



## మైనార్టీ నాయకుడు ఎండి హబీబ్ కుమారుడు
# ఎండి అలీమ్ వివాహానికి హాజరైన నాయకులు

**కొత్తకోట, నవంబర్ 19(నమస్తే ఉదయం):** కొత్తకోట మండలంలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన మైనార్టీ నాయకుడు ఎండి హబీబ్ కుమారుడు ఎండి అలీమ్ వివాహం పట్టణంలోని శివ గార్డెన్ లో జరిగింది. ఎండి హబీబ్ కుమారుడు ఎండి అలీమ్ వివాహానికి రామకృష్ణాపురం గ్రామం మాజీ సి డి సి చైర్మన్ మూలమల్ల చంద్రశేఖర్ రెడ్డి ,మాజీ డైరెక్టర్ మూలమల్ల వెంకటేశ్వర్ రెడ్డి ,మాజీ సర్పంచ్ లతా శివరాములు, భారతీయ యాదవ్, గ్రామ అధ్యక్షుడు నాగరాజు యాదవ్, కొండారెడ్డి, ఇబ్రహీం, అబ్దుల్ మాలిక్, సాలార్, రామన్ పాడు ముస్లిం సోదరులు హాజరై ఆశీర్వదించారు.

# ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలు వెంటనే నిర్వహించాలి

**సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వివి నరసింహ**

**గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 19(నమస్తే ఉదయం):** కార్మిక సంఘాలు ఏర్పాటు చేసుకోవడం పాలకుల బిక్ష కాదని దశాబ్దాల పాటు కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కని తక్షణమే ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించి కార్మిక వర్గ హక్కులను పునరుద్ధరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వివి నరసింహ డిమాండ్ చేశారు మంగళవారం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జిల్లా కేంద్రంలోని డిపో మేనేజర్ కి వినతిపత్రం సమర్పించారు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టిఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మిక సంఘాలపై ఆంక్షలు విధించి గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహించకుండా అడ్డుకున్నదని విమర్శిం చారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆర్టీసీలో యూనియన్ కార్యకలపాలకు అనుమతిని ఇస్తామని,కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ ఆర్టీసీ కార్మికులకు హామీ ఇచ్చిందని కానీ అధికారంలోకి వచ్చి 11 నెలలు పూర్తయిన ఇంతవరకు హామీని అమలు చేయలేదని విమర్శించారు గుర్తింపు సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా గతంలో నియమించిన వెల్ఫేర్ కమిటీలను కొత్తవారితో నియమించాలని ఆర్టీసీని ఆదేశించిందని విమర్శించారు ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకు రవాణా శాఖ మంత్రి గాని ఆర్టీసీ యాజమాన్యం కానీ కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించకుండా ఉండడం ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి నిదర్శమని విమర్శించారు యూనియన్ల కార్యకలాపాలపై ఆంక్షలు విధించడం కార్మికుల గొంతు నొక్కడం ప్రజాస్వామ్య విరుద్ధమని గత ప్రభుత్వం అనుసరించిన కార్మిక వ్యతిరేక విధానాలను



ఆర్టీసీ గద్వాల డిపో మేనేజర్ కు వినతి పత్రం అందజేస్తున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వివి నరసింహ

కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తూ ప్రజాతంత్ర హక్కులను కాల రాస్తున్నదని విమర్శించారు పనిగంటలు, పని వేళలు, పని భారాలు కార్మికులపై విపరీతంగా పెంచి కార్మికులను వేధిస్తున్నా రని, సిబ్బంది సరిపోను లేరని ఆఫ్ క్యాన్సిల్ డ్యూటీ చేయాలని ఇబ్బందులకు గురి చేయడమే కాకుండా డ్యూటీ అయిపోయిన తర్వాత కూడా మరో ట్రిప్ వేయమని ఒత్తిడి చేస్తున్నారని, మహిళలను కూడా మినహాయించకుండా వేధిస్తున్నారని విమర్శించారు పిఎఫ్ ఎస్ఆర్ బిఎస్ ఎస్ బిటి ట్రస్టులకు కార్మిక సంఘాల భాగస్వామ్యంతో బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ ఏర్పాటు చేయాలని, క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీకి ఎన్నికల నిర్వహించేందుకు సహక రించాలని, ఆర్టీసీ నిర్వహణలో కార్మిక సంఘాలకు భాగస్వామ్యం కల్పించాలని ప్రజాతంత్ర హక్కులను పునరు ద్ధరించి కార్మికులపై వేధింపులను ఆపాలని ప్రజా అవసరాల మేరకు బస్సుల సంఖ్య ను పెంచాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేర్ నరసింహ నాయకులు జయన్న లక్ష్మన్న యు. నరసింహ పాల్గొన్నారు.

# నిబంధనలను తుంగలో తొక్కి పనులు ప్రారంభిస్తున్న యజమానులు, సహకరిస్తున్న అధికారులు

**10 కిలోమీటర్ల లోపు ఏలాంటి గ్రామాలు ఉండకూడదు..**

**గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 19(నమస్తే ఉదయం):** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇథనాల్ కంపెనీ నిర్మాణ పనులు చేపడుతున్నారని, వెంటనే పనులు నిలిపివేయాలని పెద్ద ధన్వాడ గ్రామ రైతులు, బీజేపీ నాయకులు కోరారు. ఈ జిల్లా అధ్యక్షులు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ధన్వాడ రైతులు సర్వే నెంబర్ 174/1.174/A/1.174/A2,174/B,174/B2.29 ఎకరాల భూమిలో గాయత్రి ఇథానాల్ కంపెనీ వారు చేపట్టిన నిర్మాణ పనులు నిలిపి వేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ బిఎం. సంతోష్ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ...ఇథనాల్ కంపెనీ వలన కంపెనీ చుట్టూ 2-3 కి మీ ల దూరంలో ఉన్న చిన్న దన్వాడ, ననసూర్ మాన్ దొడ్డి,చిన్న తాంద్రపాడు, నౌరోజ్ క్యాంపు, వేణి సొంపురం, కేశవరం గ్రామాలకు ఈ కంపెనీ నుండి వచ్చే జల కాలుష్యం మరియు వాయు కాలుష్యం వలన పంట పొలాలు బీడు భూములుగా మారే ప్రమాదమున్నది అన్నారు. ఈ కంపెనీ నుండి విడుదలయ్యే కలుపితమైన నీటి వలన ప్రజలకు అనేక రకాలురోగములు వచ్చే ప్రమాదమున్నది ఈ కంపెనీ ప్రక్కనే పెద్ద దన్వాడ గ్రామానికి చెందిన దళితులకు ప్రభుత్వం 152 ఎకరాలు పంట భూమి ఇచ్చారని, మరియు 173 సర్వే నంబర్ చిన్న దన్వాడ దళితులకు గృహ నిర్మాణం కోసం 2009 సం"లో వరదల సమయంలో ప్రభుత్వం 6 ఎకరాల భూమి ఇచ్చిందన్నారు. అయినప్పటికీ కంపెనీ వారు పనులు నిలిపివేయకుండా విద్యుత్ స్తంభాలు పాతడం కొరకు వచ్చారని, ఈ పరిశ్రమ వస్తే తమ గ్రామాలకు రేడియేషన్



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బిజెపి జిల్లా అధ్యక్షులు రామచంద్రారెడ్డి

సమస్యలు వస్తాయని బాధిత గ్రామాల రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. ఇథనాల్ పరిశ్రమ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రపోజల్ పెట్టకుండానే కేంద్రం అనుమతి ఇస్తుందా అన్నారు. వ్యవసాయ భూములలో పరిశ్రమలు పెట్టాలని ఎవరూ అనుమతించరని పూర్తిస్థాయి డీపీఆర్ పంపాలని కలెక్టర్ ను మహబూబ్ నగర్ ఎంపీ. అరుణ కోరినట్లు గుర్తు చేసారు. బాధితులకు పూర్తిస్థాయి అవగాహన కల్పించకుండా ఇథనాల్ పరిశ్రమ పనులు మొదలు పెట్టొద్దని కోరారు. నిబంధనల ప్రకారం 10 కిలో మీటర్ లోపు ఎలాంటి గ్రామం ఉండకూడదని,సాగు లోకి ఉన్న భూములు ఈ ఫ్యాక్టరీ కి వాడకూడదని, ప్రభుత్వం వేసిన రోడ్డు ఈ యొక్క ఫ్యాక్టరీ కి ఉండకూడదని తెలిపారు.ఈ కార్యక్రమంలో రైతులు జయరామ్ రెడ్డి, నారాయణ, నరసింహులు, తిమ్మప్ప, శేషి రెడ్డి,జేమ్స్, దిలీప్ రెడ్డి, వీరభద్రయ్య, సత్యనారాయణ, రాజశేఖర్, శ్రీను, హనుమంతూ, సుధాకర్ గౌడ్, రాఘవ రెడ్డి,సవారీ, విష్ణు వర్ధన్ రెడ్డి, బాబు రావు, నరసింహా గౌడ్, గాలి రెడ్డి, తదితరులు ఉన్నారు.

# బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు

**జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి గంట కవితా దేవి**

**పత్తి జిన్నింగ్ మిల్లులపై అధికారుల దాడులు**

**గద్వాల టౌన్, నవంబర్ 19(నమస్తే ఉదయం):** జిల్లాను బాల కార్మిక రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి గంట కవితా దేవి పేర్కొన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు మంగళవారం పాన్ ఇండియా బాలకార్మిక రెస్క్యూ లో భాగంగా జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి గంటా కవిత మరియు బాల రక్ష భవన్ సిబ్బంది, కార్మిక శాఖ అధికారులు కలిసి గద్వాల పట్టణ శివారులో గల పత్తి జిన్నింగ్ మిల్లులో అకస్మిక తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా 7 మంది బాల కార్మికులను అధికారులు గుర్తించారు. వారిని బాలల సంక్షేమ కమిటీకి అప్పగించారు.

ఈ సందర్భంగా జడ్జి గంట కవితాదేవి మాట్లాడుతూ... బాల



బాలికలతో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి గంట కవితా దేవి

కార్మికులను పనిలో పెట్టుకునే యజమానులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 14 సంవత్సరాల వయస్సు కంటే తక్కువ వయస్సు పిల్లలను పనిలో పెట్టుకుంటే రూ. 50 వేల జరిమానా లేదా జైలు శిక్ష పడుతుందని హెచ్చరించారు. అనంతరం బాల కార్మిక నియంత్రణ చట్టం పై వారికొ అవగాహన కల్పించి వారిని బాలల సంక్షేమ కమిటీ ముందు హాజరు పరిచారు. బాలల సంక్షేమ కమిటీ వారు పిల్లలకు వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి సఖి కేంద్రానికి తరలించారు. సదరు యాజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి గంట కవిత, బాల రక్ష భవన్ సిబ్బంది పద్మ, లక్ష్మీ, అసిస్టెంట్ లీగల్ ఐడీ డిఫెన్ కౌన్సిల్స్ లక్ష్మణ స్వామి, డిప్యూటీ లీగల్ ఐడీ డిఫెన్ కౌన్సిల్స్ శ్రీనివాసులు, చీఫ్ డిప్యూటీ లీగల్ ఐడీ డిఫెన్ కౌన్సిల్స్ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## హృదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో
# ఉచిత వైద్య శిబిరము

**ఈనెల 22న చిన్నపిల్లల గుండె వ్యాధుల వైద్య శిబిరము:జిల్లా వైద్యశాఖ అధికారి సిద్ధప్ప**

**గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 19(నమస్తే ఉదయం):** ఈనెల 22న (శుక్రవారం) ఉచిత చిన్నపిల్లల గుండె వ్యాధుల వైద్య శిబిరాన్ని నిర్వహించ నున్నట్లు జిల్లా వైద్యశాఖ అధికారి సిద్ధప్ప మంగళవారం ప్రకటనలో తెలిపారు. హృదయ ఫౌండే షన్ హైదరాబాద్ వారు గద్వాల పట్టణంలోని దూద్ దవాఖాన (కేశమ్మ మెమోరియల్ ఆసుపత్రి)లో నిర్వహించ బడుతుందని, ఈ శిబిరము NMDC (నేషనల్ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్) వారి సౌజన్యంతో ఏర్పాటు చేయడం జరుగు తుందని తెలిపారు. ఈ ఆరోగ్య శిబిరంలో 0-16 సంవత్సరాల పిల్లలకు గుండె సంబంధ పరీక్షలు నిర్వహించబడును అవసరమైన వారికి 2D ECHO పరీక్షలు ఉచితంగా చేయ బడును.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యశాఖ అధికారి సిద్ధప్ప

ఈ సదవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సిద్దప్ప పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబరు 9121276741 పద్మాకర్ రావు ను సంప్రదించాలన్నారు.

## వ్యర్థాలను సమర్ధవంతంగా
# వినియోగించుకోవాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 19(నమస్తే ఉదయం):** పంట పొలాల్లోని వ్యర్థాలను సమర్థవంతంగా వినియోగించుకుంటే భూసారాన్ని పర్యావరణాన్ని పరక్షించుకోవచ్చని కేటిదొడ్డి మండల వ్యవసాయ అధికారి మహ్మద్ సాజిద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమైన ఆహర పంటల్లో వరి పంట ప్రధానమైనదని, వరి పంట



కేటి దొడ్డి మండల అగ్రికల్చర్ ఆఫీసర్ మహమ్మద్ సాజిద్

వ్యర్థాలను అధిక మొత్తంలో తగలబెట్టడం వలన భూమిలోని మఖ్యమైన పోషకాలను కొల్పోతామని ఆయన వివరించారు. రైతులు వరి పొలాలలో ఒక టన్ను వరిగడ్డిని తగలబెట్టడంవల్ల 5.5 కేజీ నత్రజని, 2.3 కేజీల భాస్వరం, 25 కేజీల పొటాషియం, 400 కేజీల సేంద్రియ ఎరువును కొల్పో తున్నామని తెలిపారు.

నేలలో ఉష్ణోగ్రతలు పెరిగి పంటలకు మేలు చేసే క్రిములు చనిపోవడం వలన సేంద్రీయ కర్బనం తగ్గిపోతుందని, వాయు కాలుష్యనికి దారి తీస్తోందని, అందుకే రైతులు పంట అవశేషాలకు విలువలు జోడించి సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.పంట వ్యర్థాలను పశువుల మేతగా వంట చెరుకు, బయోగ్యాస్, జీవన ఎరువులుగా, కంపోస్ట్ ఎరువు తయారిగా వినియోగించుకావాలని మట్టిలో కలియటం ద్వారా భూసారం పెరిగి తద్వారా నీటిని నిలువ చేసుకొని సామర్థ్యం పెంచుతుందని రైతులు ఈ పద్దతులను పాటించి పంటలో అధిక దిగుబడులు పొందాలని ఆయన సూచించారు.

## కార్తీకమాసంలో కోటిలింగాల ప్రతిష్టతో భక్తిభావలతో పులకరించి పోయిన భక్తులు

**కొత్తకోట, నవంబర్ 19(నమస్తే ఉదయం):**



కొత్తకోట మండలం కానాయపల్లి స్టేజి దగ్గర గల సుప్రసిద్ధమైన శైవక్షేత్రం

శ్రీకోటిలింగేశ్వరదత్తదేవస్థానము దగ్గర నూతనంగా నిర్మించిన ధ్యానమందిరంలో కార్తీకమాసం సందర్భంగా కోటిలింగాల ప్రతిష్టతో భక్తులు పులకరించి పోయారు.

ఆదోనికి చెందిన వీరశైవ ఆగమ పాఠశాల విద్యార్థులచే రుద్రపఠనంతో భక్తులు భక్తిశ్రద్ధలతో రుద్రహోమం చేయగా అర్చకులు వేదమంత్రాలతో పదకొండు వేల శివలింగాలు కలిగిన శివకోటి యంత్రాలకు రుద్రపఠనంతో సంకల్ప పూజలు చేయించి భక్తుల స్వహస్తాలతో పదకొండు వేల శివలింగాలు ప్రతిష్టింపచేశారు.

ఈసందర్భంగా వీరశైవ ఆగమ పాఠశాల అధ్యాపకులు మాట్లాడుతు... ఎన్నో జన్మల పుణ్యఫలం వలన మీకు ఈ లింగ ప్రతిష్ట చేసే భాగ్యంలి దక్కిందని దీని వల్ల మీ తరతరాల మీ లివంశీకులందరు పుణీతులౌతారని అన్నారు. అనంతరం ఆలయకమిటి అన్నప్రసాద వితరణ చేశారు.

# ఇందిరాగాంధీ సేవలు మరవలేనిది

**నందిగామ, నవంబర్19 (నమస్తే ఉదయం):** ఇందిరాగాంధీ 107 జయంతిని ఘనంగా నివాళులు అర్పించిన నాయకులు.ఇందిరాగాంధీ 1917 నవంబర్ 19న అలహాబాద్లోని ఆనంద్ భవన్లో భారత దేశపు తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ, కమలా నెహ్రూ దంపతులకు జన్మిం చారన్నారు. ఆమె అసలు పేరు ఇందిరా ప్రియదర్శిని అని కాగా, లండన్లోని ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీలో చదువుకున్నారని తెలిపారు. 1964లో ఆమె తండ్రి, భారత తొలి ప్రధానమంత్రి జవహర్లాల్ నెహ్రూ మరణం అనంతరం ఇందిరా గాంధీ రాజ్యసభకు ఎన్నికైందనీ లాల్ బహదూర్ శాస్త్రి మంత్రిమండలిలో ప్రసారశాఖ మంత్రిగా ఆమె విశిష్ట సేవలు అందించిందన్నారు. ఈక్రమంలో 1966లో మొదటి సారి ప్రధానమంత్రి పదవీ బాధ్యతలు స్వీకరించి.. దేశ మొదటి మహిళా ప్రధానిగా ఇందిరాగాంధీ చరిత్ర సృష్టించిందన్నారు. కాగా, నేటి వరకు మరో మహిళ భారతదేశ ప్రధాని పదవిని అధిష్టించకపోవడం ఇందిరా గాంధీ ఇప్పటివరకు తొలి మహిళా ప్రధాని కావడం విశేషం అన్నారు. ఇందిరాగాంధీ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఎన్నో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారని బ్యాంకుల జాతీయకరణ, జమీందారీ వ్యవస్థ రద్దు, గరీబీ హఠావో వంటి



మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న నాయకులు

గొప్ప పథకాలతో భారతదేశ అత్యున్నత ప్రధానిగా ఇందిరాగాంధీనిరూపించుకున్నారు. ఇలాంటి మహనీయురాలి జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలపార్టీఅధ్యక్షుడు జంగ నరసింహ యాదవ్, కొమ్ము కృష్ణ, చంద్రపాల్ రెడ్డి,ఎదిరే శ్రీకాంత్ గౌడ్, బండ్రపు జంగయ్య గౌడ్ ,చించేటి కృష్ణ ,టైలర్ కృష్ణ, సీనియర్ నాయకుడు జిల్లా కార్యదర్శి దేపల్లి శంకరయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాలతో విద్యుత్ కొనుగోలు ఒప్పందం
# దేశ చరిత్రలో చారిత్రాత్మక నిర్ణయం

- **మహిళల ఎదుగుదలకు ఎన్ని కోట్లయినా ఖర్చు చేసేందుకు మా ప్రభుత్వం సిద్ధంగా ఉంది**
- **మా ప్రభుత్వం చేసినవి ఒక సారి చూస్తే విమర్శలు చేసేవారు కళ్ళు తిరిగి కింద పడిపోతారు**
- **వరంగల్ అంటేనే భావ స్వేచ్ఛ**
- **వరంగల్ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

**వరంగల్,నవంబర్ 19(నమస్తే ఉదయం):** మహిళలు ఆర్థికంగా బాగుపడితేనే ఈ రాష్ట్రం ఎదుగుతుంది. అందుకు ఎన్ని కోట్లయినా ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఈ రాష్ట్ర ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగిన మహిళా సాధికారత భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు.

ఈ రాష్ట్ర ప్రభుత్వం మీది.. మీరు కోరుకున్న ప్రభుత్వం మీరు కోరుకున్న అన్నిటిని ఈ ప్రభుత్వం నెరవేరుస్తుందని అందుకే విజయవంతంగా ఏడాది పాలన పూర్తిచేసుకుని ధైర్యంగా సభ పెట్టామని తెలిపారు. మా ప్రభుత్వం ఏం చేసిందని ఒకాయన అడుగుతున్నారు మా ప్రభుత్వం ఏడాది కాలంలో ఇచ్చినవి ఒకసారి చూస్తే కళ్ళు తిరిగి కిందపడిపోతారని భట్టి విక్రమార్క అన్నారు. దళితులకు మూడెకరాల భూమి, ఇంటికో ఉద్యోగం అని చెప్పిన మీరు పదేళ్ల కాలంలో ఒకటి పూర్తి చేయలేకపోయారని ఎద్దేవా చేశారు.

వరంగల్ అంటేనే భావ స్వేచ్ఛ అనేక భావజాలాలకు ఈ పట్టణం నిలయమని పేర్కొన్నారు. అన్ని భావజాలాలను



స్వేచ్ఛగా మాట్లాడుకునే వాతావరణాన్ని మా ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. భావ స్వేచ్ఛ ను పునికిపుచ్చుకొని కాళోజీ దీవెనలతో మా ప్రభుత్వం ముందుకు వెళుతుందని డిప్యూటీ సీఎం సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మహిళా సంఘాలతో నాలుగు వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి నిర్ణయించి ముందుగా వారి నుంచి వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని తెలిపారు. ఈ నిర్ణయం దేశ చరిత్రలో చరిత్రాత్మకం ..భవిష్యత్తు లోనూ ఈ సాహసం ఎవరూ చేయలేరని అన్నారు.

వరంగల్ పట్టణానికి సంబంధించి ఈ రోజు చారిత్రాత్మకము. పట్టణ అభివృద్ధికి 6వేల కోట్లు కేటాయించడమే కాదు పనుల ప్రారంభానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన కూడా చేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు వివరించారు.

దేశ సమగ్రత కోసం నిరంతరం పనిచేస్తాను..నా ఒంట్లో చివరి రక్తపు బొట్టు ఉన్నంత వరకు దేశ సమగ్రత కోసం పాటుపడతనని చెప్పిన ఉక్కు మనిషి ఇందిరా గాంధీ అని కొనియాడారు. దేశంలో రాజభరణల రద్దు, బ్యాంకుల జాతీయకరణ వంటి గొప్ప సంస్కరణలు తెచ్చిన భారతరత్న మన ఇందిరమ్మ అన్నారు. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు రవాణా సౌకర్యం కల్పించామని, ప్రత్యేక వడ్డీ లేని రుణాలు 25 వేల కోట్ల చొప్పున ఐదేళ్ల కాలంలో లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు రాష్ట్ర మహిళలకు ఇస్తాం అన్నారు.

కోరి కొట్లాడి తెచ్చుకున్న గత ప్రభుత్వం ఇందిరా క్రాంతి పథం పక్కన పెట్టింది, మహిళలకు వడ్డలేని రుణాలను వదిలేసింది అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆరోపించారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలే కాదు వారిని పారిశ్రామిక వేత్తలు గా తీర్చిదిద్దుతాం అన్నారు.

వరంగల్లో జర్నలిస్ట్ కాలనీని కుర్చీ వేసుకుని కట్టిస్తా, జర్నలిస్టులు దావత్ ఇవ్వాలని చెప్పిన మనిషి జాడ లేకుండా పోయారని మాజీ సీఎం కేసీఆర్ ను పరోక్షంగా విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి ఆరు నెలల కాలంలోనే కాళోజీ కళాక్షేత్రానికి నిధులు కేటాయించి పూర్తి చేశారని తెలిపారు.

## మీలాగా రైతుల భూములను
# బలవంతంగా గుంజుకోవడం లేదు

- **రైతుల భూములను బలవంతంగా గుంజుకొని అమ్మిన దుర్మార్గులు వేదాలు వల్లిస్తుండ్రు**
- **బిజెపి లాగా ప్రజలను మోసం చేయడం కాంగ్రెస్ కు తెలియదు**
- **ఇందిరమ్మ స్ఫూర్తితో సైంటిఫిక్, నిబద్ధతతో కులగణన సర్వే జరుగుతోంది**
- **గాంధీ భవన్లో మీడియాతో మాట్లాడిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**
- **నక్లెస్ రోడ్, గాంధీభవన్లో జరిగిన ఇందిరా జయంతి వేడుకల్లో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్తో కలిసి పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**హైదరాబాద్,నవంబర్ 19(నమస్తే ఉదయం):** ఆనాటి కాంగ్రెస్ పాలకులు అసైన్ చేసి, రైతులకు పంపిణీ చేసిన భూములను గత పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పాలకులు బలవంతంగా గుంజుకొని, వాటిని లేఔట్ చేసి అమ్మిన దుర్మార్గులు నేడు రైతుల గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు విమర్శించారు.దివంగత ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా హైదరాబాద్ నక్లెస్ రోడ్ లోని పివి మార్గ్ వద్ద ఉన్న ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పిసిసి ఆధ్వర్యంలో గాంధీభవన్లో ఏర్పాటుచేసిన ఇందిరా గాంధీ జయంతి కార్యక్రమంలో పాల్గొని ఇందిరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తో కలిసి గాంధీ భవన్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడారు.

ఆనాటి కాంగ్రెస్ పాలకులు రాష్ట్రంలో 24 లక్షల ఎకరాలు అసైన్ చేసి భూ పంపిణీ చేసిన దాంట్లో, 10 వేల ఎకరాలకు పైగా హైదరా బాద్ పరిసర ప్రాంతాల రైతుల నుంచి బలవంతంగా గుంజుకొని ఆక్షన్ వేసి పైశాచిక ఆనందం పొందిన గత బిఆర్ఎస్ పాలకులకు భూ సేకరణ బాధితుల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. 2013లో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం భూ సేకరణ చట్టం తీసుకు



వచ్చిందని, ఆ చట్టం ప్రకారమే రైతుల నుంచి రాష్ట్ర అభివృద్ధి కోసం భూములు తీసుకుంటామే తప్ప మీలాగా రైతుల నుంచి బలవంతంగా భూములను తీసుకోమన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను భారతీయ జనతా పార్టీ నెరవేర్చ కుండా మోసగించినట్టుగా, కాంగ్రెస్ పార్టీ కూడా వాళ్ల మాదిరిగానే ఉంటుందని బిజెపి నాయకులు భ్రమ పడుతున్నారని విమర్శించారు. నోట్ల రద్దు సందర్భంగా దొంగ నోట్లు బయట పెడతామని, ప్రతి ఒక్కరి ఖాతాలో 15 లక్షల రూపాయలు వేస్తామని, ఏడాదికి రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తామని దేశ ప్రజలను బిజెపి మోసగించిన విధంగా కాంగ్రెస్ మోసం చేయదని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తుందన్నారు.

అనేక సంస్కరణలు తీసుకువచ్చి పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన ఇందిరాగాంధీ మార్గాన్ని ప్రజా ప్రభుత్వం అనుసరిస్తున్నారు. ఎన్నికలకు ముందు ఈ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం తెస్తాం అభివృద్ధిలో అందరికీ సమానమైన అవకాశాలు కల్పిస్తామని చెప్పాం. ఈ ఏడాది కాలంలో చేసి చూపిస్తున్నామని వివరించారు.

ఇందిరాగాంధీ స్ఫూర్తితోనే రాహుల్ గాంధీ ఈ దేశంలో కులగణన సర్వే జరగాలని ఎన్నికల్లో చెప్పిన విధంగా ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే అసెంబ్లీలో తీర్మానం చేసి కుల గణన సర్వేను సైంటిఫిక్, నిబద్ధతతో చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో ఉన్న ప్రజలందరికీ సమాన అవకాశాలు కల్పించడానికి ప్రభుత్వం తయారు చేసే ప్రణాళికలకు ఈ సర్వే దోహదపడుతుందన్నారు.

మీడియా సమావేశంలో మాజీ మంత్రి గీతారెడ్డి, ఖైరతాబాద్ శాసనసభ్యులు దానం నాగేందర్, ఫిషరీస్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్, నల్లగొండ డిసిసి అధ్యక్షులు శంకర్ నాయక్, చరణ్ యాదవ్, భూపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

**Printed and Published MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733